

డ్రంకెన్ డ్రైవ్‌లో మూడు కేసులు నమోదు

కల్వకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో మూడు కేసులు నమోదు అయినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. బుధవారం కల్వకుర్తిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో ముగ్గురు మద్యం తాగి వాహనాలు నడపడంతో పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ముగ్గురిలో మాసారపు కొండల్‌కు రెండు రోజుల జైలు శిక్ష, రూ.100ల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించడానికి వచ్చిన విద్యార్థులు



జామెట్రీ గుర్తులను గుర్తించే పార్కు ప్రదర్శన

నూతనోత్సాహం

- కొత్త విషయాలు తెలుసుకున్నాం.. ఎంతో నేర్చుకున్నాం..
- విద్యా వైజ్ఞానిక ప్రదర్శనపై విద్యార్థుల మనోభిప్రాయం
- పాఠశాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన బాల బాలికలు

తమ తోటి విద్యార్థులు మేధస్సుతో విద్య వైజ్ఞానిక ప్రదర్శనలను రూపొందించారని.. వాటిని చూసి మేము కూడా ముందుకు నడిచేందుకు అవి ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం, పోలేపల్లి టీఎస్‌ఐఐసీలోని ఎస్‌వీ కేఎం పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రెండవ రోజు బుధవారం కొనసాగింది. ఈ ప్రదర్శనలను చూసేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు.

వారిలో కొందరిని 'ఆంధ్రజ్యోతి' పలుకరించగా పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

7

- జడ్చర్ల, (ఆంధ్రజ్యోతి)



ప్రతీ వాహనానికి క్యూఆర్ కోడ్ అంశంపై ప్రదర్శన

కొనసాగుతున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన 7

ట్రాక్టర్ ట్రాలీ కింద పడి చిన్నారి మృతి



రిషిక (ఫైల్)

గట్టు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇటుక లోడ్‌తో గ్రామంలోకి వచ్చిన ట్రాక్టర్ ట్రాలీ కింద పడి నాలుగేళ్ల చిన్నారి మృతి చెందిన విషాద సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకున్నది. ఈ సంఘటనపై ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని బోయ సత్తెమ్మ అనే మహిళ కొత్తగా ఇంటి నిర్మాణం చేపడుతోంది. ఇందుకోసం కర్ణాటక నుంచి ఇటుకను కొనుగోలు చేసుకొని ట్రాక్టర్‌లో గ్రామానికి తీసుకువచ్చింది. ఇటుకలను దింపుతుండగా డ్రైవర్ ట్రాక్టర్‌ను రివర్స్ తీసే క్రమంలో అజాగ్రత్తగా వేగంగా పోనిచ్చాడు. దీంతో అక్కడే ఆడుకుంటున్న చిన్నారి రిషిక(4)ను గమనించక పోవడంతో ట్రాక్టర్ ట్రాలీ ఎడమ వైపున ఉన్న టైరు కింద పడింది. తలకు బలమైన గాయాలు కావడంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటనపై చిన్నారి తల్లి బోయ సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి, తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

యువతి ఆత్మహత్య

- ప్రేమ పేరుతో వేధింపులు, మనస్తాపంతో ఘాతుకం



రేవతి (ఫైల్)

ఖిల్లాఘణపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో ప్రేమ పేరుతో వేధింపులకు గురైన ఓ యువతి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటుచేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఖిల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన గాండ్ల భాను ప్రకాష్ అదే గ్రామానికి చెందిన యువతి రేవతి (22)ని కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ చేసినా భాను ప్రకాష్ ప్రవర్తనలో మార్పు రాలేదు. భాను ప్రకాష్ మాయమాటలను నమ్మి రేవతి డబ్బు, బంగారం అందించింది. ఈనెల 7వ తేదీన భాను ప్రకాష్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో మరో యువతితో ఉన్న ఫొటోలను పోస్టు చేయడంతో రేవతి వాటిని చూసి తీవ్ర మనస్తాపానికి గురై మగళవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి గోపమ్మ బుధవారం పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు భాను ప్రకాష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ఆంజనేయులు, నాగరాజు, ప్రవీణ్, అంజమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రికార్డు స్థాయిలో రక్త సేకరణ

- ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం
- 559 యూనిట్లతో జిల్లాలోనే మొట్టమొదటిసారిగా రక్త సేకరణ

వనపర్తి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వనపర్తి జిల్లాలోనే మొట్ట మొదటిసారిగా 559 యూనిట్ల రక్తం సేకరించినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. బుధవారం వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఒక రోజు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 559 యూనిట్ల రక్తం సేకరించడం ఇదే మొదటిసారి అని వైద్యాధికారులు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసినందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు.



రక్తదానం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

7

రేపటి నుంచి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ

- పాల్గొననున్న 1,550 మంది
- మూడు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు
- ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి



మాట్లాడుతున్న శారదాబాయి

7

క్రీడలతో ఆరోగ్యం

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్‌పీ వెంకటేశ్

6

నేడు వనపర్తికి డిప్యూటీ సీఎం

- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్



డిప్యూటీ సీఎం ప్రారంభించనున్న వనపర్తి సబ్ స్టేషన్ వద్ద అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. బుధవారం అయన వనపర్తి విద్యుత్ శాఖ కార్యాలయం, ఏదుట్ల సబ్‌స్టేషన్‌ను వద్ద ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. డిప్యూటీ సీఎం నేటి ఉదయం రేవల్లి మండలం తల్పునూరు గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్, గోపాల్‌పేట మండలంలోని ఏదుట్ల గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం వనపర్తి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో 33/11 కేవీ, పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ 33/11 కేవీ, గోపాల్‌పేట మండలం చెన్నూరు గ్రామానికి సంబంధించిన 33/11 కేవీ, శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన 33/11 కేవీ మొత్తం ఏడు సబ్ స్టేషన్‌లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం కలెక్టరేట్‌లో అధికారుల సమావేశం ఉంటుందని తెలిపారు. అధికారులు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, విద్యుత్ శాఖ డీఈ శ్రీనివాస్, తహసీల్దార్లు ఉన్నారు.

భార్యను చంపిన కేసులో
భర్తకు జీవిత ఖైదు

- ఎస్పీ రావుల గిరిధర్



వనపర్తి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : భార్యను పెట్రోల్ పోసి తగలబెట్టిన కేసులో భర్తకు జీవిత ఖైదు, ఏడువేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత తీర్పు వెల్లడంచినట్లు ఎస్పీ రావుల గిరిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ వివరాల మేరకు వనపర్తి జిల్లా ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలకిష్టాపూర్ తండాకు చెందిన మూడావత్ మనెమ్మను తన భర్త గోపాల్ నాయక్ 2020 నవంబరు 5వ తేదీన పెట్రోల్ పోసి తగలబెట్టాడు. బాధితురాలు చికిత్స పొందుతూ డిసెంబరు 20వ తేదీన మృతి చెందింది. మృతురాలి కుమారుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు, మృతురాలు మరణ వాంగ్మూలం తీసుకొని అప్పటి సీఐ సీతయ్య భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. బుధవారం నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆన్ సునీత తీర్పు వెల్లడించారని తెలిపారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసినందుకు పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ అధికారులను ఎస్పీ అభినందించారు. త్వరలోనే రివార్డులు కూడా అందజేయనున్నట్లు తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారు చట్టాల నుంచి తప్పించుకోలేరని, ఎప్పుడో ఒక రోజు శిక్ష పడుతుందని ఎస్పీ తెలిపారు.

సోలార్ పవర్ ప్లాంట్‌కు
స్థలాన్ని గుర్తించాం : కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని గుర్తించినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఉదయం ప్రజాభవన్ నుంచి మంత్రులు వివిధ శాఖల అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల లక్ష్యాలకనుగుణంగా భూమిని నిర్దేశించిన గడువులోగా పూర్తిస్థాయిలో గుర్తించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి తద్వారా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లాలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న భూములను కూడా గుర్తించామని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే స్వయం సహాయక సంఘాలకు ఇందిరా మహిళా శక్తి ద్వారా రుణ సదుపాయం కల్పించామని తెలిపారు. అదే తరహాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచడం కోసం జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం భూసేకరణ, ధరణిపెండింగ్ దరఖాస్తులు, ధరణి, ల్యాండ్ కేసులు, కోర్టు సమస్యలపై అదనపు కలెక్టర్ సీతారామారావు సంబంధిత శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలని క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో పరిష్కరించేటట్లు చూడాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా సమావేశంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, కలెక్టరేట్ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలి : కలెక్టర్

ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేర్వేరు చోట్ల 316 క్వింటాళ్ల
రేషన్ బియ్యం పట్టివేత



హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడిన లారీ

ఎర్రవల్లి/ ఇటిక్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో వేర్వేరు చోట్ల 316 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. కోదండాపురం ఎస్‌ఐ స్వాతి కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని కోదండాపురం స్టేజి దగ్గర 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి 300 క్వింటాళ్ల లోడ్‌తో వెళ్తున్న లారీని పోలీసులు పట్టుకుని విచారించారు. పెద్ద మొత్తంలో బియ్యం రవాణా జరుగుతుండటంతో సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించి పీడీఎస్ బియ్యంగా ధ్రువీకరణ చేశారు. సివిల్ సప్లయ్ జూనియర్ అసిస్టెంట్ మహర్షి ఫిర్యాదు మేరకు వాహనాన్ని సీజ్ చేశామని, డ్రైవర్ సలేష్, వే బిల్లు దారుడు రాముపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా ఇటిక్యాల మండలంలోని సాతర్ల గ్రామ శివారులో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యం లోడ్‌తో నిలిచి ఉన్న వాహనాన్ని గుర్తించినట్లు ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



చేపల విక్రయ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ధరూర్ మండలంలోని రేవులపల్లికి చెందిన తెలుగు విజయలక్ష్మి సబ్సిడీపై మంజూరైన వాహనాన్ని బుధవారం గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి (పీఎంఎంఎస్‌వై) పథకానికి జిల్లా మహిళా సమాఖ్య సభ్యురాలు విజయలక్ష్మి ఎంపిక కావడంతో ఆమెకు సబ్సిడీపై చేపల విక్రయ వాహనాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, వ్యవసాయ మార్కెటీ చైర్మన్ కుర్వ హనుమంతు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సంగీత, జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు ఉన్నారు.

మా వాటా రెండు టీఎంసీల
నీటిని వాడుకుంటాం

- ఏపీ ఎస్‌ఈతో మాట్లాడిన అలంపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అయిజటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల పంటలు కాపాడేందుకు తెలంగాణ వాటా నీటిని వాడుకుంటామని బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ ఎస్‌ఈతో అలంపూర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన 'అడుగంటిన ఆర్డీఎస్' కథనానికి ప్రజాప్రతినిధులు స్పందించారు. ఈ మేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సంయుక్తంగా కలిపి టీబీ డ్యామ్ నుంచి ఇండెంట్ ద్వారా సాగునీరు తీసుకోవాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు కర్నూలు ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచందర్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఇప్పటికే తెలంగాణ వాటాగా రావలసిన సాగునీటిలో రెండు టీఎంసీలు వాడుకుంటున్నామని, అయినప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో పారకపోవటంతో రెండు రాష్ట్రాలు కలిపి ఇండెంట్ పెట్టి రైతులను ఆదుకుందామని కోరారు. వారి ప్రతిపాదనకు కర్నూలు ఎస్‌ఈ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే విజయుడు తెలిపారు.

శరభలింగేశ్వర స్వామి రథోత్సవం



స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు

ఊట్కూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం తిప్రస్‌పల్లి గ్రామంలో వెలిసిన శరభలింగేశ్వర స్వామి రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గ్రామంలోని భక్తులందరు గోవిందనామస్మరణ చేస్తూ స్వామి వారి రథాన్ని ముందుకు లాగారు. రథోత్సవంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

దేశంలో బహుజన బిడ్డలకు గుర్తింపు లేదు

- డీఎస్పీ అధినేత విశారదన్ మహరాజ్

నవాబ్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలో జరుగుతున్న క్రీడల్లో బహుజన బిడ్డలను క్రీడల్లో గుర్తింపు లేదని డీఎస్పీ(ధర్మసమాజ్ పార్టీ) అధినేత విశారదన్ మహరాజ్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొల్లూర్ గ్రామంలో నిర్వహించిన పూలే అంబేడ్కర్ వాలీబాల్ టోర్నమెంటులో పాల్గొని గెలుపొందిన కర్ణాటక మొదటి బహుమతి, ఖమ్మం రెండవ బహుమతి, రూరల్ విభాగంలో చిన్న రేవల్లి, షాద్‌నగర్ జట్లకు నిర్వాహకులు చందర్ నాయక్, మహ్మద్ ఖాజా, లక్ష్మీనర్సింహ రాజు, రఘు గుప్తలతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో బహుజన బిడ్డలకు గుర్తింపు నిస్తే ప్రపంచంలో బహుజన బిడ్డలు మంచి గుర్తింపు పొందేవారన్నారు. కార్యక్రమంలో రమేష్ గౌడ్, కృష్ణగౌడ్, జంగయ్య, జగన్, గోపాల్ గౌడ్, రత్నబాబు, అరవింద్, డప్పు బాలకిష్టయ్య, నిరంజన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా కోసం పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

- 4 నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు



పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య బృందం

కోయిలకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : బీమా డబ్బుల కోసం నాలుగు నెలల క్రితం విద్యుదాఘాతంతో మృతి చెందిన రైతు పసుపుల ఊశన్న మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని వీరంపల్లి గ్రామానికి చెందిన రైతు పసుపుల ఊశన్న నాలుగు నెలల క్రితం 2024 సెప్టెంబరు 17న పొలానికి నీరు పెట్టడానికి వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందారు. అప్పుడు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు. దీంతో పోస్టుమార్టం నిర్వహించకుండా అంత్యక్రియలు నిర్వహించారు. కొద్ది రోజుల తర్వాత కుటుంబ సభ్యులు బ్యాంకులు, ఎల్ఐసీ వద్దకు బీమా కోసం వెళ్లగా పంచనామా, పోస్టుమార్టం రిపోర్టు అడిగారు. దీంతో 2025 జనవరి 4న భార్య పసుపుల సత్యమ్మ కోయిలకొండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం తహసీల్దార్ రాజాగణేష్, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో వీరంపల్లిలో రైతు పొలం వద్ద పూడ్చిన మృతదేహానికి పోస్టుమారం నిర్వహించారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్ని ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం దగ్గర ఇందిరమ్మ ఇళ్ల నమూనాను ఇంటిని ప్రారంభించి వారు మాట్లాడారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూంలను ఇస్తామన్ని చెప్పి ప్రజలను మోసం చేసి ఇప్పటి వరకు మండలంలోని ఒక్కటికటి కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఒక్కొక్కటి అమలు చేస్తున్నామని, 26 నుంచి రైతులకు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లోకి డబ్బులను జమ చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అర్హులైన ఇళ్లు లేని నిరు పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి 5 లక్షల వరకు నగదును అందిస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందిస్తామన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు.

అనంతరం ఇందిరమ్మ ఇంటి నమూనాను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, నరసింహారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫారుక్‌అలీ, మండల నాయకులు జవహర్, రాంపాండు, హన్మంతురెడ్డి, భారతమ్మ, అంజన్‌కుమార్‌రెడ్డి, కొండశ్రీను, రామస్వామి, ఎంపీడివో శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పీయూ'ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

- పీయూలో విజయోత్సవ సభ



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పీయూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం పీయూలో లైబ్రరీ ఆడిటోరియంలో పీయూ విద్యార్థి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన పీయూకి లా, ఇంజనీరింగ్ సాధించిన విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మధురమైన అనుభవాలను ఈ విశ్వవిద్యాలయం నుంచి తీసుకోవాలని అన్నారు. తెలంగాణలోని గొప్ప యూనివర్సిటీలలో మన పీయూ ఉండాలని అన్నారు. పీయూ గౌరవాన్ని పెంచాల్సిన బాధ్యత మీ చేతుల్లోనే ఉందని అన్నారు. వీలైనంత త్వరగా విశ్వవిద్యాలయంలో లా, ఇంజనీరింగ్ కళాశాల భవనాలను నిర్మించాలని అన్నారు. పీయూలో లా, ఇంజనీరింగ్ కోర్సులు రావడానికి విద్యార్థి నాయకుల విజయమని అన్నారు. విద్యార్థులు పీయూ ఎదుట ఒక బస్‌స్టాప్, పీయూలో బ్యాంక్ అండ్ ఏటీఎం, పీయూ అదనంగా భూమిని కేటాయించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే అనుకూలంగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, వీసీ ఓఎస్‌డీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్, పీయూ అధికారులు డాక్టర్ కుమారస్వామి, పీయూ విద్యార్థి నాయకులు కార్తీక్, బత్తిని రాము, వంశీ, గణేష్, ఆంజనేయులు, భారత్‌బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలి

- వీసీ జీఎన్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి మరిన్ని ప్రోత్సాహకాలు అందించాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఫార్మసీ ఆడిటోరియంలో సోషల్ సైన్సెస్, కామర్స్ ఎంబీఏ విభాగాలు, సమరసత వేదిక, భూమిలేని వ్యవసాయ కూలీల ఫోరమ్‌లు సంయుక్తంగా భూమిలేని వ్యవసాయ కూలీల సామాజిక-ఆర్థిక సుస్థిరాభివృద్ధిపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రోజురోజుకు యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో గ్రామాల్లో కూలీలకు పనిదొరకక ఇంకా నిరుపేదలుగా ఉన్నారని అన్నారు.

అలాంటి పేదకూలీల కోసం ప్రభుత్వాలు, పరిశ్రమలు ముందుకు వచ్చి వ్యవసాయ రంగాలలో పూర్వవైభవం తీసుకురావాలని అన్నారు. అనంతరం ముఖ్య వక్తలు శ్యామ్ ప్రసాద్, విజయ్ భాస్కర్ మాట్లాడారు. రైతు, కౌలురైతు, కూలీల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని అన్నారు. నీటి సౌకర్యం, పేదలకు భూ పంపిణీ చేయాలని, పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ చెన్నప్ప, కన్వీనర్ డాక్టర్ కుమారస్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు ఉత్తర ద్వార దర్శనం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్ శర్మ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి సందర్భంగా సూర్యలక్ష్మి కాటన్ మిల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామని వేంకటేశ్వర సేవా మండలి అధ్యక్షుడు తోటపల్లి శ్రీకాంత్ శర్మ తెలిపారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు నుంచి వచ్చిన ప్రత్యేక నిపుణులు తిరుమల తిరుపతిలో ఉన్నట్లుగానే ఏడు ద్వారాలను ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ద్వారాల తోరణాల మధ్య భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పి స్తామన్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. క్యూలైన్లు, తాగునీటి వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పూలంగి సేవ రూ.2,500 కేవలం 100 మంది భక్తులకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. ఉదయాస్తమాన సేవ రూ.10,000 కేవలం పది మంది భక్తులకు మాత్రమే ఉంటుందని, ముందుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే స్వామివారి సేవలో పాల్గొంటారని తెలిపారు. సేవా మండలి ప్రధాన కార్యదర్శి గుండ్యాల రాఘవేంద్రశర్మ, కోశాధికారి గుండా వెంకటేశ్వర్లు, సభ్యులు కౌకుంట్ల సుదర్శన్‌గౌడ్, వెంకట్రాములుగౌడ్, ఎదిర ప్రమోద్‌కుమార్, కొండ చక్రధర్‌గుప్తా, మిర్యాల వేణుగోపాల్ పాల్గొన్నారు.

న్యాయ సేవలు గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలి

- జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి పాపిరెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అందిస్తున్న న్యాయ సేవలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలని జిల్లా ప్రిన్సిపల్ న్యాయాధికారి పాపిరెడ్డి సూచించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు బుధవారం కోర్టు ప్రాంగణంలోని సమావేశ మందిరంలో మనో న్యాయ్ లీగల్ సర్వీసెస్ యూనిట్ సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంకా న్యాయ సేవలు అందడం లేదన్నారు. పారాలీగల్ వలంటరీలు గ్రామీణ ప్రాంతాల్లో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మనోన్యాయం కమిటీ బ్యానర్‌ను విడుదల చేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి ఇందిర, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అల్తాఫ్, సీడీపీవో నర్మద, సఖీ లీగల్ కౌన్సిలర్ అరుణ, ఎన్జీవోలు చంద్రశేఖర్, మహేందర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

- ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆరోగ్యం లభిస్తుందని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ. వెంకటేశ్ అన్నారు. మహబూబ్‌నగర్ టౌన్ ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో క్రికెట్ టోర్నీ నిర్వహించారు. పోటీలను ఎన్పీ. వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఫొటో గ్రాఫర్స్ పోటీలు నిర్వహించడం పట్ల సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, హరిష్‌కుమార్, గౌరవ పట్టణ అధ్యక్షుడు నర్సప్ప, అధ్యక్షుడు అంజియాదవ్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోశాధికారి గోపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

యాసంగిలో 72వేల ఎకరాలకు సాగునీరు

- ఏప్రిల్ 15 వరకు వారబంది పద్ధతిలో విడుదల
- రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలి
- విలేకరుల సమావేశంలో ఎస్ఈ రహిముద్దీన్



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఈ రహిముద్దీన్

గద్వాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జూరాల, నెట్టంపాడు, ఆర్డీఎస్ ప్రాజెక్టుల కింద యాసంగిలో 72వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ ఎస్ఈ రహిముద్దీన్ తెలిపారు. బుధవారం గద్వాల పట్టణంలోని పీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రాజెక్టుల కింద సాగు వివరాలను వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు నల సోమనాద్రి కాలువ కింద 15వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, రైతులు డిస్ట్రిబ్యూటర్ 31వరకు మాత్రమే సాగు చేయాలని సూచించారు. నాలుగు రోజులు నీటిని విడుదల చేసి మూడు రోజులు బంద్ చేస్తామని తెలిపారు. నెట్టంపాడు ప్రాజెక్టు పరిధిలో 20వేల ఎకరాలకు, రైతులు కుడి కాలువ కింద 105వ ప్యాకేజీ డీ-5 15వేల ఎకరాల వరకు అందిస్తామని తెలిపారు. అదేవిదంగా ఎడమ కాలువ 104వ ప్యాకేజీ కింద (డీ-2) 5వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. సాగునీటిని నాలుగు రోజులు విడుదల చేసి ఆరు రోజులు బంద్ చేస్తామని తెలిపారు. ఆర్డీయస్ కింద 37వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. అవసరాన్ని బట్టి ఇండెంట్ పెడుతామని తెలిపారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకుంటూ ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. మనకు విడుదల చేసిన నీటిని కర్ణాటక రైతులు పంపులతో ఎత్తిపోసుకోవడం వలన ఆర్డీఎస్ ప్రాజెక్టుకు నీళ్లు చేరడం ఆలస్యం అవుతుందని వివరించారు.

డిజిటల్ అరెస్టులు ఉండవు

-సైబర్ డీఎస్పీ గిరిబాబు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అరెస్టులు ఎక్కడా ఉండవని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్ డీఎస్పీ గిరిబాబు అన్నారు. సైబర్ జాగృక్త దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ అరెస్టు అనే థీమ్ ఆధారంగా జరిగిన కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్ మెడికల్ కళాశాల విద్యార్థులకు సైబర్ భద్రతకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమానికి సుమారు 150మంది ఎంబీబీఎస్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల పెరుగుతున్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని డిజిటల్ భద్రత చర్యలను పాటించడం అత్యంత అవసరమని డీఎస్పీ తెలిపారు. అనంతరం డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ దాడులు లేదా ఆన్‌లైన్ మోసాలు జరిగే సందర్భంలో 1930 నెంబరుకు కాల్ చేయడం లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృతజ్ఞత, సీఐ కనకయ్య, ఇతర మెడికల్ కాలేజ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన బోధన చేయాలి

- రాష్ట్ర ఇంటర్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి



పాలెం జూనియర్ కళాశాలలో లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కళాశాల సిబ్బంది

నాగర్‌కర్నూల్‌టౌన్/తిమ్మాజిపేట/బిజినేపల్లి/తాడూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సిలబస్ సకాలంలో పూర్తి చేసి, విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి అధ్యాపకులను ఆదేశించారు. బుధవారం ఆయన నాగర్‌కర్నూల్ జిల్లాలోని తిమ్మాజిపేట, బిజినేపల్లి, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మొదట తిమ్మాజిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేసి విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం బిజినేపల్లి మండలం పాలెంలోని వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులను, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అక్కడి నుంచి నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వం బాలికల జూనియర్ కళాశాలను పరిశీలించారు. ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు 90 రోజుల ప్రణాళిక అమలు చేస్తోందని, దానికి మూల్యాంకనం చేస్తున్నామన్నారు. విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు నైపుణ్య విద్యాబోధన చేపట్టాలని అధ్యాపకులను ఆదేశించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని, కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. అలాగే ఈఏపీసెట్ నిర్వహించి ఉన్నత విద్యాభ్యాసం చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. బిజినేపల్లిలో కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ గౌడ్, అధ్యాపకులు కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. తిమ్మాజిపేటలోనూ కళాశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ అనసూయ డిప్యూటీ డైరెక్టర్‌కు వివరించారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో తాడూరులోని కూచకుళ్ల సౌభాగ్యమ్మ ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, కళాశాల అధ్యాపకులకు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు. నాగర్‌కర్నూల్ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ నోడల్ అధికారి జి.వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు, సిబ్బంది, బిజినేపల్లిలో లెక్చరర్లు మదన్ మోహన్ రెడ్డి, ఎండీ గౌడ్, గోపి, బండి నరసింహ, వెంకటయ్య, పద్మజ, వినోద్, రామకృష్ణ, రాములు, రేవతి, సిబ్బంది రామోహన్, విజయలక్ష్మి, నిజాముద్దీన్, సాయిలు, బాలమ్మ, రాజు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతికం వైపు దృష్టి సారించాలి

- అమరచింతకు చేరిన కలాం స్ఫూర్తి బస్సు యాత్ర



అమరచింతలో విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న సీఈవో మధులాష్ బాబు

అమరచింత, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం విద్యార్థులకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిజ్ఞానంతో పాటు ఆసక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎడ్‌ద్వజాస్ కంపెనీ సీఈవో మధులాష్ బాబు పేర్కొన్నారు. బుధవా రం కలాం స్ఫూర్తి యాత్ర పట్టణానికి చేరింది. ఈ సందర్భంగా పట్టణంలోని హైస్కూల్ ఆవరణలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంగమ్మతో కలిసి మొబైల్ సైన్స్ ల్యాబ్ సందర్శనను ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించిన కలాం స్ఫూర్తి బస్సుయాత్రను 33 జిల్లాలో పర్యటించి మారుమూల ప్రాంత విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక బస్సులో ఏర్పాటు చేసిన రోబోటిక్స్, వెదర్ స్టేషన్, డ్రోన్, సూపర్ కంప్యూటర్, న్యూటన్ మూడో గమన సూత్రం తదితర 16 రకాల సైన్స్ పరికరాలను విద్యార్థులకు ప్రత్యక్షంగా వివరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బస్సులో ఉన్న పరికరాలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, బస్సు యాత్రం సభ్యులు శ్రీజ సోగాల, అర్చన నాగపూరి, రోహిత్ జలగం, అజయ్‌రెడ్డి, దిలీప్ కుమార్, సాయి సుబ్రహ్మణ్యం, బాలు, సయ్యద్ కలాంపాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్ మెడల్



వర్క్‌షాప్‌లో నిర్వాహకుల నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న లింగం

పెద్దకొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఒడిశాలో పటాన్ హుస్సేన్ ఖాన్ ఆధ్వర్యంలో ఈ నెల 5, 6 తేదీలలో జరిగిన ఏడో జాతీయ వర్క్ షాప్ పెద్దకొత్తపల్లికి చెందిన ఫొటో గ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్ వచ్చింది. అంతరించిపోతున్న గిరిజన జాతిలో బోండా తెగ వారి సంప్రదాయాలు, వేషధారణ, నృత్య జీవనశైలి విధానాలపై ఒడిశాలో నిర్వహించిన ఈ వర్క్ షాపునకు వివిధ రాష్ట్రాల నుంచి ఫొటోగ్రాఫర్లు 100 మంది పాల్గొన్నారు. హుస్సేన్ ఖాన్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో నిర్వాహకులు ఎస్వీ రమేష్, రవి, రామకృష్ణ వారి చేతుల మీదుగా కొత్తపల్లికి చెందిన ఎస్ఎల్ స్టూడియో నిర్వాహకుడు అవగారి లింగానికి గోల్డ్ మెడల్ అందజేశారు. మండల కేంద్రంలోని ఉన్న ఫొటోగ్రాఫర్లు జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ పొందిన లింగం బుధవారం అభినందించారు.

మంత్రి సీతక్కకు ఆహ్వానం



మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రికను అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను ఆహ్వానిస్తూ బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హైదరాబాద్‌లో ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 16 నుంచి 22వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని ఆమెను శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యేతో ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి ఉన్నారు.

11న గాంధీ మునిమనవడి రాక

అచ్చంపేట జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్‌గాంధీ ఈ నెల 11న అచ్చంపేటకు రానున్నట్లు విశ్రాంత ప్రొఫెసర్, గాంధీ స్మారకనిధి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ విజయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ స్మారకనిధి, గాంధీ కింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బాపుబాటలో సత్యశోధన 100 రోజుల్లో 1000 కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా అచ్చంపేటకు వస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించే బాపు బాటలో సత్యశోధన ముగింపు సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణతో పాటు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లురవి హాజరవుతారని, ఈ కార్యక్రమానికి గాంధేయవాదులు, యువతి, యువకులు, ఉపాధ్యాయులు హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళా రైతుకు రాష్ట్రపతి నుంచి ఆహ్వానం

తెలకపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజధాని న్యూఢిల్లీలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడకలకు ఎట్ హోం రాష్ట్రపతి కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని కార్వంగ గ్రామానికి చెందిన సేంద్రియ వ్యవసాయ మహిళా రైతు కే లావణ్యరమణారెడ్డికి భారతరాష్ట్రపతి నుంచి ఆహ్వానం వచ్చింది. ఆ ఆహ్వాన పత్రికను మహిళ రైతుకు బుధవారం సాయంత్రం అందజేసినట్లు నాగర్‌కర్నూల్ సబ్ డివిజన్ అధికారి సృజన్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో తపాలాశాఖ ఎంవో మహిమూద్‌ఖాన్, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు ప్రియాంక, జి.శంకరయ్య పాల్గొన్నారు.

మరికల్ గురుకుల పాఠశాల తనిఖీ



కళాశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తాపట్నాయక్

మరికల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను బుధవారం రాత్రి కలెక్టర్ సిక్తాపట్నాయక్ తనిఖీ చేశారు. ఇంటర్, ఎంపీసీ, బైపీసీ తరగతుల గదులకు వెళ్లి విద్యార్థినుల స్టడీ అవర్‌ను పరిశీలించారు. అనంతరం పదోతరగతి ఏ, బీ సెక్షన్ విద్యార్థులతో మాట్లాడుతూ పదోతరగతి పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో ఏం అవుతారని విద్యార్థినులను అడిగితెలుసుకున్నారు. ఎస్ఐ రామును పాఠశాలకు పిలిపించి ఆకతాయిల పని పట్టాలని, పాఠశాల వద్ద మహిళ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

ఆవిష్కరణలు అద్భుతం

» మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ



ప్రదర్శనను తిలకిస్తున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు అద్భుతంగా ఉన్నాయని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. జడ్చర్ల మండలంలోని పోలేపల్లి టీఎస్‌ఐఐసీలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను బుధవారం ఆమె తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినూత్నమైన ఆవిష్కరణలను ప్రదర్శించిన విద్యార్థులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ఎదిగేలా పోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలపై వారికి అవగాహన కలిగించాలని, కొత్త ఆలోచనలను ప్రోత్సహించి ఉన్నతంగా ఎదిగేందుకు కృషి చేయాలని చెప్పారు.

సైన్స్ లేనిదే అభివృద్ధి లేదు

» రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



ప్రదర్శనను తిలకిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ లేనిదే అభివృద్ధి లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. పూర్వీకుల ఆహారమైన చిరుధాన్యాలు గొప్ప ఆహారం అన్నారు. పోలేపల్లి టీఎస్ ఐఐసీలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు చిరుధాన్యాలను పంటలు పండించాలని కోరారు. సంచార జీవనం నుంచి ఆధునిక మానవుడి దాకా ఎన్నో పరిణామాలు జరిగాయని, దీని వెనక శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయద్వారానే మానవ నాగరికత అభివృద్ధి చెందిందన్నారు. మంచి చేయాలన్నా, చెడు చేయాలన్నా సైన్స్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అనేక దేశాలు సైన్స్‌ను దుర్వినియోగ పరుస్తూ యుద్ధాలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరం పిల్లల్లో చురుకుదనం, తెలివితేటలు ఎక్కువన్నారు. పరిశీలన, పరిశోధనల ద్వారా పరిష్కారాలను అన్వేశించాలని సూచించారు. మార్పు ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు.

నూతనోత్సాహం

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి కొత్త విషయాలను తెలుసుకున్నామని, ఎంతో నేర్చుకున్నామని విద్యార్థులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం, పోలేపల్లి టీఎస్‌ఐఐసీలోని ఎస్‌వీకేఎం పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన రెండవ రోజు బుధవారం కొనసాగింది. ప్రదర్శనను చూసేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారు. దీంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. మంగళ, బుధ వారాల్లో 15 వేల మందికి పైగా విద్యార్థులు వచ్చి నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడింది. ప్రదర్శనపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నది. ప్రయోగాలు, ఎగ్జిబిట్లు తమకు స్ఫూర్తి కలిగించాయని, కొత్త ఆలోచనలను రేకెత్తించాయని తెలి పారు. ప్రయోగాలు చేయాలన్న ఉత్సాహం కలిగిందని అన్నారు. వివరాలు వారి మాటల్లోనే..



విజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు బారులు తీరిన విద్యార్థులు

» కొత్త విషయాలు తెలుసుకున్నాం.. ఎంతో నేర్చుకున్నాం..

» విద్యా వైజ్ఞానిక ప్రదర్శనపై విద్యార్థుల మనోభిప్రాయం

» వివిధ పాఠశాలల నుంచి వేలాదిగా తరలివచ్చిన బాల బాలికలు

కొత్త వాషింగ్ మిషన్ తయారు చేస్తా..



సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన వాషింగ్ మిషన్‌ను చూశా. దానికంటే మెరుగ్గా, మరింత వినూత్నంగా మరో వాషింగ్ మిషన్‌ను తయారు చేస్తా. అందుకోసం నా ఆలోచనలకు పదును పెడతాను. వైజ్ఞానిక ప్రదర్శనకు రావడం, కొత్త ప్రయోగాలు, ఎగ్జిబిట్లను చూడటం ఎంతో ఆనందంగా ఉంది. వాటి నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. నేను కూడా సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలని అనిపించింది.

- అభినయ్, ఉదయ మెమోరియల్ హైస్కూల్, జడ్చర్ల.

మంచి ప్రయోగాలు చూశా



వైజ్ఞానిక ప్రదర్శనలలో తోటి విద్యార్థులు ప్రదర్శించిన ఎన్నో ప్రయోగాలు చూశాను. నాకు కూడా అలాంటి ప్రయోగాలు చేయాలని అనిపించింది. మా ఉపాధ్యాయులతో మాట్లాడి ఇప్పటి నుంచే కొత్త ప్రయోగాలు మొదలుపెడుతా. మొత్తంగా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో స్ఫూర్తి నిచ్చింది.

- అనూష, జడ్పీహెచ్ఎస్, సల్కర్‌పేట.

వైజ్ఞానిక ప్రదర్శన స్ఫూర్తినిచ్చింది



విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నాకు చాలా స్ఫూర్తి కలిగించింది. ఏదైనా కొత్త ప్రయోగం చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆలస్యం చేయకుండా ఉపాధ్యాయులతో మాట్లాడి సలహాలు, సూచనలు తీసుకుంటాను. సైన్స్ ఫెయిర్‌లో నేను చూసిన వాటికి భిన్నంగా, ఇంకా కొత్త ప్రయోగాలు చేసేందుకు ప్రయత్నిస్తా.

- స్పందన, జడ్పీహెచ్ఎస్, పెద్దరేవల్లి

కొత్త ఉత్సాహం కలిగింది



రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను చూసిన తర్వాత నాలో కొత్త ఉత్సాహం కలిగింది. కొత్త ప్రయోగాలు, సరికొత్త ప్రదర్శనలు ఆసక్తి కలిగించాయి. ఆలోచనలకు పదును పెట్టుకునేందుకు, కొత్త ప్రయోగాలు చేసేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడింది. కొత్త కొత్త ప్రయోగాలను చూడటం వల్ల, నేను కూడా ఏదైనా వినూత్నమైన ప్రయోగం చేయాలని అనిపించింది. అందుకోసం ఇప్పటి నుంచే ప్రయత్నం చేస్తా.

- ఆరీఫ్, మాడ్రన్ స్కూల్, మహబూబ్‌నగర్.

ఎంతో నేర్చుకున్నా..!



వైజ్ఞానిక ప్రదర్శనను చూసి ఎంతో నేర్చుకున్నాను. వాటిని చూసిన తర్వాత ఏదైనా తయారు చేయాలన్న ఉత్సాహం కలిగింది. ప్రదర్శన ద్వారా నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టేందుకు కృషి చేస్తాను. నా తోటి విద్యార్థులు చేసిన ప్రయోగాలు, కొత్త ఆవిష్కరణలు నాలో స్ఫూర్తి నింపాయి. వినూత్నమైన ప్రయోగాలు తయారు చేయాలన్న ఆలోచన పుట్టింది. ఉపాధ్యాయుల సహకారంతో కొత్త ప్రయోగాలు చేసేందుకు ప్రయత్నిస్తాను.

- శ్రీవేద, జడ్పీహెచ్ఎస్, గోగారం, కోస్గి.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పోలేపల్లి ఎస్‌వీకేఎం పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో భాగంగా బుధవారం సాయంత్రం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఎస్‌వీకేఎం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు అబ్బుర పరిచాయి. వివిధ పాఠశాలల విద్యార్థినుల శాస్త్రీయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య విష సర్పాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ రకాల పాములను చూపించి, వివరించారు. కార్యక్రమంలో డీఈవో ప్రవీణ్ కుమార్, డీఎస్‌వో శ్రీనివాసులు, ఎంఈవో మంజులాదేవి, సీఎంవో బాలుయాదవ్, ఏఎంవో శ్రీనివాస్, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు

పోలేపల్లి ఎస్‌వీకేఎం పాఠశాలలో మంగళవారం ప్రారంభమైన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగియనున్నది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరు కానున్నారని తెలిపారు.



పిరమిడ్ విన్యాసాలను ప్రదర్శిస్తున్న ఎస్‌వీకేఎం విద్యార్థులు

కొనసాగుతున్న విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని పోలేపల్లి టీఎస్ ఐఐసీలో గల ఎస్‌వీకేఎం పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన బుధవారం రెండవ రోజూ కొనసాగింది. సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ అంశంతో పాటు ఏడు ఉప అంశాలలో జిల్లా స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనల నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారంతా తమ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించింది. కొందరు విద్యార్థులతో మాట్లాడి వారు చేసిన ప్రయోగాలు, ప్రదర్శనల వివరాలను తెలుసుకున్నది.



పోషక ఆహారంతో రోగ నిరోధకశక్తి

పోషకాలు ఉన్న పదార్థాలు తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, జబ్బులకు చెక్ పెట్టవచ్చంటూ మహబూబాబాద్, ఏకశిల ఎంజెల్స్ పాఠశాల విద్యార్థిని లక్ష్మీప్రసన్న తన ప్రదర్శనను రూపొందించింది. ఫాస్ట్ ఫుడ్‌ను అత్యధికంగా తినడం వల్ల అనారోగ్యం బారిన పడతారని తన డెమోను ప్రదర్శించింది.

ఆపద సమయాల్లో అలర్ట్

అగ్ని ప్రమాదం, భూకంపం సంభవించినప్పుడు, ట్రాక్ పై రైలు పట్టాలు విరిగినప్పుడు ముందస్తుగా హెచ్చరించే ప్రయోగాన్ని నారాయణపేటలోని యూనివర్సల్ స్కూల్ విద్యార్థినులు అలియా తబస్సు, గులఫ్షా తైబాలు ప్రదర్శించారు. ఆపద సమయాల్లో రైలుకు ఏర్పాటు చేసిన సెన్సర్ అలర్ట్ చేస్తుందని వారు వివరించారు.





ఇంట్లోనే ఆయుర్వేదం

ఇంట్లో ఉండే దినుసులతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చని భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట, సున్నంబట్టి ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ ఆయుర్వేదంపై డెమో నిర్వహించాడు. శివాంజనం, చరఖాంజనంతో ఎన్నో ఉపయోగాలున్నాయని వివరించారు. వీటిని తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని తెలిపారు.

వినికిడి లోపం ఉన్న వారికి ప్రత్యేక హెల్మెట్

వినికిడి లోపం ఉన్న వారు ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు ప్రమాదాల బారిన పడకుండా ప్రత్యేకమైన హెల్మెట్‌ను ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, చెన్నారం జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ప్రియ రూపొందించింది. హెల్మెట్‌కు అమర్చిన సెన్సర్ వెనుక నుంచి వచ్చే వాహనాలను గుర్తించి పసుపు, ఎరుపు లైట్లను వెలిగించి అలర్ట్ చేస్తుంది.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జడ్చర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కంటైనర్, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొని ఒకరు మృతి చెందారు. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక కర్నాటక రాష్ట్రం, బీదర్ జిల్లా, ముస్తం గ్రామానికి చెందిన అగిసినోర్ నాగార్జున నెల రోజులుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి బయలు దేరిన బస్సు, బుధవారం తెల్లవారుజామున మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం, మల్లెబోయిన్‌పల్లి సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొన్నది. ప్రమాదంలో డ్రైవర్ నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య మీనాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి మరొకరు..

కల్వకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్‌పై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన తిరుపతయ్య (50) ట్రాక్టర్‌పై కల్వకుర్తి నుంచి తెలకపల్లికి బయలుదేరాడు. లింగసానిపల్లి సమీపంలో అతడు ప్రమాదవశాత్తు నుంచి కింద పడటంతో ట్రాక్టర్ అతడి మీది నుంచి వెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేపటి నుంచి జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ

» పాల్గొననున్న 1,550 మంది » ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ టోర్నీకి జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రం వేదిక కానున్నది. పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ నిర్వహించనున్నారు. స్థానిక స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యనిర్వాక కార్యదర్శి శారదాబాయి మాట్లాడారు. స్టేడియం లోని మూడు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పగలుతో పాటు, రాత్రి వేళ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. టోర్నీలో 36 బాలికలు, 35 బాలుర జట్లు పాల్గొననున్నట్లు చెప్పారు. 29 రాష్ట్రాలు, ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1,550 మంది క్రీడాకారులు, 200 మంది అధికారులు, సిబ్బంది హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. టోర్నీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. బాలికలకు భగీరథకాలనీలోని మూడు బాలికల మైనార్టీ గురుకులాల్లో, బాలురకు బీకేరెడ్డి కాలనీలోని మైనార్టీ బాలుర గురుకులాల్లో వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీపీహెచ్ఎస్‌లో క్రీడాకారులందరికీ భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. టోర్నీ నిర్వహణకు ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుదుధ్‌రెడ్డి, జి. మధుసూధన్‌రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి, కలెక్టర్ విజయేంద్రబోయి, ఎస్పీ జానకి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లా క్రీడా శాఖ అధికారి ఎస్. శ్రీనివాస్, టోర్నీ ఆర్గనైజర్ జీయావుద్దీన్, వాలీబాల్ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య, పీడీలు వేణుగోపాల్, బాలరాజ్, ఫారుక్ ముకర్రం, కోచ్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

» జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జోగుళాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గద్వాల మండల పరిధిలోని కుర్వపల్లి శివారులో పరశురాముడు అనే వ్యక్తికి చెందిన మిరప చేనులో పని చేయిస్తున్న 11 మంది బాల బాలికలను ఆపరేషన్ స్మైల్ బృందం గుర్తించి, విముక్తి కల్గించినట్లు తెలిపారు. వారిని పనిలో పెట్టుకున్న పరశురాముడుపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. తనిఖీల్లో ఆపరేషన్ స్మైల్ ఇన్‌చార్జి ఎస్ఐ కేశవరావు, లేబర్ అధికారి మోహిన్, ఐసీడీఎస్ అధికారి లక్ష్మీదేవి, చైల్డ్‌లైన్ అధికారి కళావతి, ఎన్‌జీవో లత, పోలీసులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

5.5 తులాల బంగారు అపహరణ

మహబూబ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంటి తాళం పగులగొట్టి బంగారం దోచుకెళ్లిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగింది. ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సద్దలగుండు ప్రాంతంలో నివసించే ప్రైవేట్ ఉద్యోగి మామిడి ప్రేమ్‌కుమార్ ఈనెల ఒకటిన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోనికి వెళ్ళి చూడగా బీరువాలో ఉన్న ఐదున్నర తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో అతడు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో క్లూస్ టీం సంఘటనా పరిశీలించి, ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సాగునీటి కష్టాలు తీరడం లేదు

» ఉమ్మడి జిల్లాకు నష్టం చేసే ప్రతిపాదన రద్దు చేయాలి

» పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్

మరికల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి కష్టాలు తీరడం లేదని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు - రంగారెడ్డి పథకం నుంచి పాలమూరు - డిండి పేరున నీటిని తరలించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నష్టం కలిగించే ప్రతిపాదనలను రద్దు చేయాలని కోరుతూ ఎంపీలు, ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా మరికల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల పాటు పాలమూరు అధ్యయన వేదిక పోరాడి సాధించుకున్న పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రీడిజైన్ పేరుతో జూరాల నుంచి, 90 మీటర్ల దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టులోకి మారింద న్నారు. తొలి ప్రాధాన్యం ఇచ్చి పాలమూరు - రంగారెడ్డి పథకాన్ని పూర్తి చేయాల్సి ఉండగా, గత ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టిందని విమర్శించారు. పాలమూరు - రంగారెడ్డి పథకానికి కేటాయించిన నీటిని రెండు భాగాలుగా విభజించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. పైగా పాలమూరు - డిండి పేరున జిల్లాకు నష్టం చేసే ప్రతిపాదనను ముందుకు తెచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై అప్పట్లో పాలమూరు అధ్యయన వేదిక, ఉమ్మడి జిల్లా ప్రజల వత్తిడిని, వాస్తవ పరిస్థితిని గమనంలోకి తీసుకుని, అప్పుడు మంత్రిగా ఉన్న జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకుని 12 మంది ప్రజాప్రతినిధుల సంతకాలతో ముఖ్య మంత్రికి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. దీంతో ఆ చర్యలు ఆగిపోయాయన్నారు. కానీ కాంగ్రెసు ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాలమూరు - డిండి పేరున నీటి తరలింపు పథకాన్ని మరోసారి ముందుకు తెచ్చిందని ఆరోపించారు. దీన్ని ప్రజా ప్రయోజనాల రీత్యా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో అరుంధతి ఉద్యోగ బంధు సేవాసమితి కన్వీనర్ హన్మంతు, అసిస్టెంట్ ప్రొఫెసర్ తిమ్మప్ప, సతీశ్ భైరెడ్డి, అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు, సుదర్శన్ పాల్గొన్నారు.

హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మక్తల్, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను వెంటనే భర్తరఫ్ చేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి పాలమూరు కన్వీనర్ రామవాచారి, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు డి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని ఏఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై, రాజ్యాంగంపై వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అరుంధతి బంధుమిత్ర సేవా సమితి జిల్లా నాయకుడు జుట్ల హన్మంతు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీశ్‌భైరెడ్డి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్, బీసీ ఐక్యవేదిక నాయకులు రామాంజనేయులుగౌడ్, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, డీటీఎఫ్ నాయకులు సూర్యచంద్ర, శ్రవణ్‌కుమార్, కల్యాణం రాజు, భగవంతు, నారాయణ, భాస్కర్ పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్యేలకు రాసిన లేఖను ప్రదర్శిస్తున్న పాలమూరు అధ్యయన వేదిక నాయకులు

ఇంటర్వ్యూ..

పేదరిక నిర్మూలన మహిళా సమాఖ్య లక్ష్యం

- ఏపీఎం అరుణ



పెద్దకొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనే మహిళా సమాఖ్య ప్రధాన లక్ష్యమని ఏపీఎం అరుణ అన్నారు. మహిళా సంఘాలతోనే గ్రామీణ మహిళల కు ఆర్థిక ప్రయోజనం చేకూరుతోందని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పేర్కొన్నారు.

మండలంలో ఎన్ని పొదుపు సంఘాలు ఉన్నాయి. ఎంత మంది సభ్యులు ఉన్నారు ?

పెద్దకొత్తపల్లి మండలంలో 789 పొదుపు సంఘాలకు గాను 7950 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు.

స్త్రీనిధి ద్వారా ఎంత మందికి ఎన్ని కోట్లు రుణాలు ఇచ్చారు.

2024 మంది సభ్యులకు శ్రీనిధి ద్వారా రూ. 15,02,48,500 అప్పుగా తీసుకున్నారు.

స్త్రీనిధి ద్వారా ఎంత పొదుపు చేయించారు.

శ్రీనిధి ద్వారా ఒక సంఘానికి 7200 రూపాయలు పొదుపు చేయించాం.

ఐకేపీ సిబ్బంది పనితీరు ఎలా ఉంది?

ఐకేపీలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉన్నారు. వారు అన్ని సంఘాల సభ్యులకు సలహాలు, సూచనలు ఇస్తూ యాక్షన్ ప్లాన్ తయారు చేస్తారు. వీవోల సమావేశాలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. ఐకేపీ సిబ్బంది పనితీరు బాగుంది.

న్యూస్ బాక్స్

నేడు లక్ష్మీనర్సింహస్వామి పాలక మండలి ప్రమాణ స్వీకారం

ఉప్పునుంతల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం పాలక మండలి ప్రమాణ స్వీకారం గురువారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని దేవస్థానం ఈవో నర్సింహులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ హాజరవుతారని అన్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి స్థానిక నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

టైలర్ వర్కర్స్ యూనియన్ ఎన్నిక

అచ్చంపేట టౌన్,జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బస్టాండ్ ఆవరణలోని సమీపంలో టైలర్స్ వర్కర్స్ యునియన్ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఉల్వర శ్రీరాములు, ఉపాధ్యక్షునిగా బాలరాజు, జనరల్ సెక్రెటరీగా కిషోర్, కోశాధికారిగా నానిలతో పాటు పలువురిని కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎంఈఎఫ్ డివిజన్ అధ్యక్షుడిగా భాస్కర్

కల్వకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కల్వకుర్తి డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన ఇంజమూరి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కన్వీనర్ దేవరపాక ప్రభాకర్ నూతన డివిజన్ కమిటీని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా పాలాది రామేశ్వయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదగిరి, కోశాధికారిగా ఈ.జంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 20మందిని నూతన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. మాన్యులు మందకృష్ణ మాదిగ సారథ్యంలో సుప్రీంకోర్టు తీర్పు సాధించామని తెలిపారు. ఈనెల 11న ఉస్మానియా ఆర్ట్స్ కళా శాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం నేతృత్వంలో ఎంఈఎఫ్ సదస్సు నిర్వహించనున్నట్లు అందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు.

ఐటీడీఏ వైద్యాధికారి పోస్టు కోసం 13 దరఖాస్తులు

మన్ననూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మన్ననూరు ఐటీడీఏ పరిధిలో వైద్యాధికారి పోస్టు ఎంపిక కోసం 13మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. బుధవారం దరఖాస్తుకు చివరిరోజు కావడంతో మొత్తం ఇద్దరు ఎంబీబీఎస్, ఇక బీఏఎంస్, 10 మంది బీహెచ్ఎంఎస్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హత కలిగిన వారిని గుర్తించి వైద్యాధికారి ఎంపిక జరగాల్సి ఉందని కార్యాలయ ఏఓ జాఫర్ హుసేన్ తెలిపారు.

బస్సు పునఃప్రారంభించాలని చెన్నంపల్లి వాసుల వినతి

పదర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు పునఃప్రారంభించాలని ఆ గ్రామస్థులు బుధవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గతంలో చెన్నంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు వస్తుండేది. మధ్యలో ఆపేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులు హన్మంత్ నాయక్ ఆధ్వర్యంలో అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ దుర్గాప్రసాద్‌ను కలిసి తమ సమస్య విన్న వించుకున్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో గ్రామస్థులు విషయం చెప్పగా వెంటనే అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి చెన్నంపల్లి గ్రామానికి బస్సును తప్పని సరిగా పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మద్దిమడుగు ఆలయ పాలక మండలి సభ్యులు సుబ్బదాసు బిచ్యా నాయక్, భీముడు నాయక్, చందు నాయక్, స్వామి ఉన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

- టీజీవో క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్



కలెక్టరేట్‌లో టీజీవో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్‌టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గెజిటెడ్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం (టీజీవో) నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం టీజీవో జిల్లా అధ్యక్షుడు పి.రాజశేఖర్ రావు ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆవిష్కరింపజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గెజిటెడ్ ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందజేయడంతో పాటు జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో టీజీవో జిల్లా కార్యదర్శి పి.సంజీవ్, గౌరవ అధ్యక్షుడు ఖాజామైనుద్దీన్, కోశాధికారి రాజు గౌడ్, సభ్యులు లలిత, రవీందర్‌రెడ్డి, ఎండీ.యూనిస్, జహంగీర్, అశోక్, ప్రతాప్ పాల్గొన్నారు.

జానపద కళాకారులకు అభినందనలు

రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో మొదటి బహుమతి పొందిన జానపద నృత్య కళాకారులను కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. బుధవారం జిల్లా యువజన, క్రీడల అధికారి వి.సీతారాం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మర్యాద పూర్వంగా కలిసిన జానపద కళాకారుల బృందాన్ని కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా యువజన క్రీడల అధికారి వి.సీతారం మాట్లాడుతూ మంగళవారం హైదరాబాదులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన రామస్వామి గ్రూప్ జానపద నృత్య బృందం మొదటి బహుమతి గెలుపొంది జాతీయ స్థాయి ఎంపికయ్యారన్నారు. కళాకారులు రాంచందర్, పౌరాణిక కళాకారుడు డి.రాములు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

మన్ననూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని, క్షయ రహిత భారత్ నిర్మాణానికి ప్రతీ పౌరుడు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఆరోగ్య వైద్యాశాకాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి అన్నా రు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్ర మంలో భాగంగా వంద రోజుల క్షయ నిర్ధారణ పరీక్షల డ్రైవ్‌ను మన్ననూరు ఐటీడీఏ పరిధిలో గల అప్పాపూర్, పర్హాబాద్ పెంటల్లో ఆమె బుధవారం ప్రారంభించారు. క్షయ వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మన్ననూరు పీహెచ్‌సీని సందర్శించి ఇమ్యునైజేషన్ టీకా మందుల పంపిణీకి సిబ్బంది తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై గల మన్ననూరులో ట్రామా సెంటర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రతిపాదించారని, కేంద్రం మంజూ రైతే క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, మన్ననూరు వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, క్షయ కేంద్రం పర్యవేక్షకుడు ఆరీఫ్‌ఖాన్, ఫార్మాసిస్టు శ్రీకాంత్, ఆరోగ్య సహాయకులు లోక్య, హరిలాల్, శరత్ తదితరులు పాల్గొన్నారు.



అప్పాపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ స్వరాజ్యలక్ష్మి

బీజేపీ నాయకుల నిరసన



ఊర్కొండలో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో అడ్డుకుంటున్న ఎస్ఐ వీరబాబు

కొల్లాపూర్/ చారకొండ/ ఊర్కొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని ఖండిస్తూ కొల్లాపూర్‌లో బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. చారకొండలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తిరుమల లావణ్య బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఖండించారు. ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ఊర్కొండలో బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా, ఎస్ఐ వీరబాబుతో పాటు పోలీసుల అడ్డుకున్నారు. ఇలా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కొల్లాపూర్ ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం మధ్యాహ్నం బీజేపీ నాయకులు చేపట్టిన రాస్తారోకో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎస్ఐ రిషికేష్ నేతృత్వంలో డేగ కళ్లతో పోలీసులు పహారాలో ఉన్నా దిష్టి బొమ్మ దహనం చేయకుండా నిలువరించ లేకపోయారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మూలే భరత్‌చంద్ర, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు తమటం సాయికృష్ణ, సత్యనారాయణ, కాడం శ్రీనివాస్, ఇమ్రాన్, నారాయణ తదితరులను బలవంతంగా పోలీసులు వాహనాల్లో ఎక్కించుకుని స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని వాటిని చరమగీతం పాడడానికి బీజేపీ నాయకులు సిద్ధంగా ఉన్నామని అన్నారు. చారకొండ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు. ఊర్కొండలో బీజేపీ నాయకులు రాజేందర్ గౌడ్, ఆంజనేయులు, లక్ష్మారెడ్డి శ్రీనివాసులు ఉన్నారు.

మత్స్యకారులకు నష్టం కలిగిస్తే సహించేది లేదు

- జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు

బల్మూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చెరువుల్లో నీటిని తొలగించి మత్స్యకారుల జీవితాలతో చెలగాటమాడితే సహించేది లేదని జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు అన్నారు. మండలం చెన్నారం గ్రామంలోని నల్లచెరువు తూమును తొలగించడంతో పాటు అలుగును ధ్వంసం చేసిన స్థలాన్ని డైరెక్టర్లతో కలిసి ఆయన పరి శీలించారు. తూము ప్రాంతాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా మత్స్యకార సంఘం డైరెక్టర్ వెంకటయ్య ముదిరాజ్, సంఘం తాలూకా కోశాధికారి పాపయ్య, తుమ్మన్‌పేట మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, లింగం, సత్య నారాయణ, దశరథం, నిరంజన్, పరమేశ్ పాల్గొన్నారు.

జెన్‌కో కెమిస్ట్ ఉద్యోగం సాధించిన సంధ్యారాణి

- నియామకపత్రం అందజేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సంధ్యారాణికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన దూమర్ల సంధ్యారాణి 2023 జెన్‌కో ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో కెమిస్టు గెజిటెడ్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణల చేతుల మీదుగా సంధ్యా రాణికి బుధవారం ఉద్యోగ నియామకపత్రాన్ని అందజేశారు. సంధ్యారాణి భర్త ఇంటలిజెన్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినందుకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్థులు సైతం వీరిని అభినందించారు.

టీపీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా అనిల్‌గౌడ్



రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న అనిల్‌గౌడ్

చారకొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : చారకొండకు చెందిన అడ్వకేట్ ఆరేళ్ల అనిల్ గౌడ్ టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కమిటీ జాయింట్ కన్వీనర్‌గా బుధవారం నియామకమయ్యారు. టీపీసీసీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, అనిల్‌గౌడ్ నియామక పత్రాన్ని అందజేశారు. అనిల్‌గౌడ్ నియామకం పట్ల కుటుంబ సభ్యులు, మండల నాయకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

-బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్

తిమ్మాజిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులతో కలిసి ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో దళితున్ని సీఎం చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని బీఆర్ఎస్ తుంగలో తొక్కిందని, కాంగ్రెస్‌ను విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయ కులకు లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ బహదూర్, దానం బాలరాజు, లక్ష్మీనారాయణ, నాగసాయిలు, అనంతచారి, మల్లేష్, వరుణ్‌కుమార్, సహదేవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో

పెంట్లవెల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని రామాపురం గ్రామంలో బుధవారం తాగునీటి సమస్య పరిష్కరించాలని ఏడోవార్డులో కాలనీవాసులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల నాయకులు ఆకునమోని చంద్రయ్య మాట్లాడుతూ నెల రోజుల నుంచి 5, 7 వార్డుల లో నీళ్లు రాక ప్రజలు నిత్యం ఇబ్బందు లకు గురవుతున్నారని వారన్నారు. స్థానిక గ్రా మ పంచాయతీ అధికారులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పుల్లయ్య, కిష్టయ్య, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి

- డీఈవో రమేష్ కుమార్

వంగూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో కృత్యాధార విధానం ద్వారా ఉపాధ్యాయులు తరగతి బోధన చేసి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని డీఈవో రమేష్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాల, కొండారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొండారెడ్డిపల్లిలో పదవ తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధన ప్రక్రియను పరిశీలించారు. వంగూరులో కేజీబీవీ విద్యార్థినులతో కలిసి డీఈవో భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కేజీబీవీల పర్యవేక్షణ అధికారి శోభారాణి, ఏంఈవో మురళీమోహనచారి ఉన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

కొల్లాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సింగోటం మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులలో భాగంగా శుక్రవారం కొల్లాపూర్ మునిసిపాలిటీకి మిషన్ భగీరథ వల్ల నీరు సరఫరా కాదని మునిసిపల్ చైర్ పర్సన్ మేకల రమ్య వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇది వరకు జరిగిన మరమ్మతుల్లో గ్యాస్ కిట్ సమస్య ఏర్పడడం వలన తిరిగి మరమ్మతులు చేయవలసిన పరిస్థితి వచ్చిందన్నారు. శుక్రవారం నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు. నేడు, రేపు మరమ్మతులు చేపడుతున్నామన్నారు.

రైతు రుణమాఫీ చేయాలి

పెద్దకొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ రైతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ. 15వేలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో లేగ దూడ మృతి

ఊర్కొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో లేగ దూడ మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు పోలే శేఖర్ తెలిపిన వివరాలు..రోజు మాదిరిగా మంగళవారం రాత్రి ఆవులతో పాటు లేగ దూడను మండల శివారులోని తన వ్యవసాయ భూమిలో ఉన్న పశువుల పాకలో ఉంచి ఇంటికి వచ్చినట్లు తెలిపారు. బుధవారం తెల్లవారు జామున పాలు తీయడానికి వెళ్లగా లేగదూడ మృతి చెంది ఉన్నదని, కుక్కలు అక్కడే ఉన్నాయని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దేవుని తిరుమలాపూర్ గ్రామంలో 8 మంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆ గ్రామ మాజీ సర్పంచు వి.సత్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు వి.శ్రీనివాసులు, మిద్దె శివయ్య, బొల్లె విష్ణు, బాలస్వామి పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీ లక్ష్యం పూర్తి చేయాలి

ఊర్కొండ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ లింకేజి టార్గెట్ పూర్తి చేసి స్త్రీనిధి నిధులు రికవరీ పై దృష్టి పెట్టాలని ఎంపీడీవో కృష్ణయ్య స్త్రీనిధి ఆర్ఎమ్ మహేంద్ర కుమార్‌లు అన్నారు. రైతువేదికలో బుధవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ సంఘాల బైలా పుస్తక నిర్వహణ, బ్యాంకుల ద్వారా వచ్చే రుణాలపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు అధికారులు హరిచంద్ర ప్రసాద్, రాజు, గోపాల్, డీసీఎం శ్రీనివాసులు, అరుణదేవి, వెంకటేశం, ఏపీఎం సంతోష్, అధ్యక్షురాలు సుమిత్రమ్మ పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి

- మార్కండేయ ఎత్తిపోతల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు



శాయిన్‌పల్లిలో మార్కండేయ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ఈఈ పార్థసారథిని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి

నాగర్‌కర్నూల్‌టౌన్/ బిజినేపల్లి/ తిమ్మాజిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి అన్నారు. బిజినేపల్లి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో బుధవారం మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం శాయిన్‌పల్లి గ్రామ సమీపంలోని మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పంపుల ట్రయల్ రన్‌ను, కొనసాగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు సంక్రాంతి తర్వాత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలచే ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అప్పటి లోపు పెండింగ్ పనులను పూర్తి చేయాలని కేఎల్ఐ ఈఈ పార్థసారథి, హెచ్ఈఎస్ కంపెనీ జీఎం సుబ్రమణ్యంలను ఆదేశించారు. ట్రయల్ రన్ విజయవంతంపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట శాయిన్‌పల్లి సర్పంచ్ అవంతి శంకర్, మండల అధ్యక్షుడు మిద్దె రాములు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, మార్కెట్ డైరెక్టర్ వాల్యానాయక్, హరీష్ రెడ్డి, బంగారి పర్వతాలు, రాంచందర్ నాయక్, నగేష్, బాల పీరు, కత్తి ఈశ్వర్, ఖలీల్, శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో కతలప్ప, హౌసింగ్ ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం సంబంధించిన నమూనా ఇంటి పనులను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో చాంబర్‌లో అధికారులతోనూ సమావేశమయ్యారు. హౌసింగ్ పీడీ సింగప్ప, డీఈ హరినాయక్, ఏఈ రాజావర్ధన్ రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ జవహర్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, విద్యావార్ రవిచందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ బహదూర్, వెంకట్రామిరెడ్డి, దానం బాలరాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవులు, లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, వెంకట్రాములు, ఎల్లారెడ్డి ఉన్నారు.

● నాగర్‌కర్నూల్ టౌన్ : జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు ఫంక్షన్‌హాలులో జన వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ పిల్లల జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు, బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనాధ పిల్లలను చేరదీసి వారికి వసతి కల్పించడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిస్తున్న జనవికాస స్వచ్ఛంధ సంస్థ సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తీగల సునేంద్ర, నిజాముద్దీన్, బాదం సునీత, జన వికాస సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



వెల్దండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి మండలం తర్నికల్ నుంచి శ్రీరామ్‌నగర్ వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయడం పట్ల ఆ గ్రామ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిల చిత్రపటాని కి క్షీరాభిషేకం చేశారు. రోడ్డు నిర్మాణం జరిగితే మెరుగైన రవాణా సౌక ర్యం ఏర్పడుతుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, తిరుపతయ్య, మురళి, తిరుపతి, రవి, మల్లేష్, పరశురాములు, శ్రీను పాల్గొన్నారు.

● వెల్దండ : బీటీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడంతో మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సుమారు వందకోట్లతో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, పీఏసీఎస్ డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, సంజీవ్‌కుమార్‌యాదవ్, నాయకులు యెన్నం భూపతిరెడ్డి, పర్వత్ రెడ్డి, రషీద్, పత్యానాయక్, గున్నెళ్ల శ్రీను, పుల్లయ్య, రాములు, హమీద్, ఎర్రశ్రీను ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

కొల్లాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఉన్న బాలికల కస్తూర్బా పాఠశాల విద్యార్థులకు పాఠశాల అవసరాల రీత్యా వినియోగించుకునేలా రత్నగిరి ఫౌండేషన్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ జూపల్లి జగన్‌మోహన్ రావు సహకారంతో కంప్యూటర్ బ్యాటరీలను రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, బుధవారం పాఠశాల అధ్యాపకులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు పాఠశాల అవసరాల కోసం కంప్యూటర్ లేక ఇబ్బంది పడుతున్నామని తెలియజేయడంతో నేడు వారికి అందజేసినట్లు ధర్మతేజ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సువర్ణ, ఉపాధ్యాయురాలు మంజుల, హేమలత, ఫౌండేషన్ సభ్యులు సాయిచరణ్ , సురేష్ ఉన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పెద్దకొత్తపల్లి, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి) : సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో బుధవారం ఆర్యవైశ్య మహిళలు ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. మొత్తం 15 మంది పోటీల్లో పాల్గొనగా ఇందులో మొదటి బహుమతి జె.వరలక్ష్మి, రెండవ బహుమతి జె.జ్యోతి ఎంపికయ్యారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రేమ్‌కుమార్ శెట్టి, పోల చంద్రమౌళి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అప్రమత్తంగా ఉండి సైబర్‌నేరాలకు లోనుకాకుండా ఉండాలని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణంలోని వైఆర్ఎం కాలేజ్‌లో సైబర్ జాగ్రత్త దివస్‌ను పురస్కరించుకుని సైబర్ నేరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవ గాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 100 డయల్, 1930 టోల్‌ఫ్రీ నెంబర్లపై అవగాహన కలిగించారు. నార్కోటిక్ డ్రగ్స్ నేరాల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

● తెలకపల్లి : సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.నరేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యా సంస్థలో జూనియర్ కళాశాల విద్యార్థులకు నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్టుల గురించి తెలకపల్లి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మర్యాద ప్రకాశ్‌రెడ్డి, పోలీసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినుముల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

పెంట్లవెల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మినుముల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు కోరారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. పెంట్లవెల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎక్కువగా మినుము పంటలు సాగు చేస్తారని, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు హనుమంతు, ఈశ్వర్, ఎల్లగౌడ్, తిమ్మస్వామి, చిట్టెమ్మ పాల్గొన్నారు.

సమస్యలపై ఉద్యమించాలి

తెలకపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్ కోరారు. మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాది 12వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎం.విజయ్ గౌడ్, నందిపేట భాస్కర్, జగదీశ్ పాల్గొన్నారు.

రుణమాఫీని వెంటనే అమలు చేయాలి

కోడేరు : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగిల్‌విండో బ్యాంకులో అధికారుల నిర్లక్ష్యం ప్రభుత్వ అలసత్వము రైతులకు రుణ మాఫీ కావడం లేదు. నాయకులు రవి, వెంకటస్వామి, రాములు, వెంకటమ్మ పాల్గొన్నారు.